
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 16 ఏప్రిల్ 2024
5





చాందినీ వస్త్రాలంకరణలో కల్యాణ మండపం

దక్షిణ అయోధ్యకు నవమి శోభ

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రం శ్రీరామనవమి శోభను సంతరించుకుంది. ఎటు చూసినా.. స్వాగత ద్వారాలు.. చలువ పందిళ్లు.. చాందినీ వస్త్ర అలంకరణలు.. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న రామాలయ ప్రాంగణం.. మొత్తంగా భద్రాచల క్షేత్రం ఇల వైకుంఠంగా దర్శన మిస్తోంది. ఎటు చూసినా సీతారాముల కల్యాణ పలుకులే... ఎవరి నోట విన్నా ఆది దంపతుల స్మరణే.. బుధవారం శ్రీ సీతా రామచంద్రస్వామి కల్యాణం మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభితమైన కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి వైకుంఠ ద్వారం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

- సమీపిస్తున్న సీతారాముల కల్యాణ గడియలు
- నేడు ఎదుర్కోలు ఉత్సవం
- రేపు మిథిలా మండపంలో శ్రీసీతారాముల కల్యాణం
- ఎల్లుండి మహా పట్టాభిషేకం
- ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయశాఖ కమిషనర్, కలెక్టర్, ఎస్పీ

భద్రాచలం, ఏప్రిల్ 15: శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాద్రి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. శ్రీరామనవమి పనులు తుదిదశకు చేరుకున్నాయి. రామాలయానికి విద్యుత్ దీపాలంకరణలు, వెదురు పందిళ్ల, చాందినీ వస్త్రాలంకరణలు, బాపు రమణీయ చిత్రాలు భక్తులకు కన్నులవిందు చేస్తున్నాయి. స్వాగత ద్వారాలు, భక్తరామదాసు కీర్తనలతో భక్తాద్రిగా మారిపోయింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాద్రికి చేరుకుంటున్నారు. అలాగే ఎదుర్కోలు, శ్రీరామనవమి, మహా పట్టాభిషేకాలను పురస్కరించుకొని స్వామివార్లను తీసుకెళ్లే మార్గాన్ని దేవస్థానం అధికారులు, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ 1800 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసింది.

నేత్రపర్వంగా ధ్వజారోహణం

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ధ్వజారోహణం నేత్రపర్వంగా సాగింది. శ్రీ మహావిష్ణువు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుని పటాన్ని ఈ సందర్భంగా ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఇప్పటినుంచి పూర్ణిమ నాటి వరకు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు దేవతలకు, ఇటు మానవులకు తెలిపేలా ఈ ధ్వజారోహణ జరుపుతారు. అలాగే అష్టదిక్పాలకులు, పంచలోక పాలకులు, దేవతలకు ఆహ్వానించే బేరి పూజ కార్యక్రమాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత ఆయా దేవతలకు ఇష్టమైన ప్రసాదాలను అర్పించి బ్రహ్మోత్సవాలు జరిగినన్నాళ్లు ఆలయంలో ఉండి స్వామిని దర్శించే భక్తులకు శుభాలు కలిగేలా దీవించాలని కోరుతూ కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణాన్ని పురస్కరించుకొని అందజేసే ప్రసాదంతో సంతాన ప్రాప్తి కలుగుతుందనే నమ్మకంతో అధిక సంఖ్యలో మహిళలు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, కలెక్టర్, ఎస్పీ

శ్రీరామనవమి ఏర్పాట్లను దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలు పరిశీలించారు. ఈ క్రమంలో సీఎం సెక్టారు, వీవీఐపీ సెక్టార్లతో పాటు ఇతర సెక్టార్లలో చేపట్టాల్సిన మార్పులు, చేర్పుల గురించి స్థానిక అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్, మాట్లాడుతూ భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 24 సెక్టార్లలో ఎల్ఈడీ టీవీలు ఏర్పాట్లు చేస్తున్నారు.


శ్రీరామనవమి వేడుకల సమాచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవమి రోజు భక్తులకు ఉచిత దర్శనం

శ్రీరామ నవమి రోజు భద్రాచలం విచ్చేసే భక్తులకు దేవస్థానంలో ఉచిత దర్శన సౌకర్యాన్ని కల్పిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దేవస్థానం ఈవో రమాదేవి నోట్ విడుదల చేశారు. శ్రీరామ నవమి రోజున మిథిలాస్టేడియంలో సీతారాముల కల్యాణం వీక్షించేందుకు వచ్చే భక్తులకు దేవస్థానంలో ఉచిత దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఈవో తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బుధవారం నిర్వహించనున్న శ్రీరామ నవమి, గురువారం పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సమన్వయంతో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. సెక్టార్లవారీగా ఇన్‌చార్జ్ అధికారులు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సుమారుగా రెండువేల మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు పార్కింగ్ స్థలాలు, లడ్డు కౌంటర్లు, సెక్టార్ల వివరాలను తెలియచేస్తూ జిల్లా పోలీసుల తరపున ప్రత్యేకంగా ఒక క్యూఆర్ కోడ్‌ను రూపొందించామని, భక్తులందరూ దీన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు


6

కల సాకారమైన వేళ

- గోదావరిపై రెండో వారధి సిద్ధం
- రాకపోకలను ప్రారంభించిన కలెక్టర్


6

శిల్పకళా శోభితం..

- మిథిలా స్టేడియంలో అద్భుత కల్యాణ మండపం
- ఆకట్టుకునే శిల్పాలు ఎన్నో..

6

ఒక్క క్లిక్ చాలు..

- అరచేతిలో సమస్త సమాచారం
- రామయ్య భక్తుల కోసం క్యూఆర్ కోడ్



6

ఎంతో రుచిరా...

- నిత్య నివేదనలో ఎన్నో ప్రసాదాలు
- భద్రాద్రి కదంబంకు జాతీయ ఖ్యాతి

పులకించిన జమలాపురం

- అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- కన్నుల పండువగా తెప్పోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణ క్రతువులో తాళిబొట్టును భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 15: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వసంత నవరాత్రులలో ప్రధాన ఘట్టమైన శ్రీవారి కల్యాణం వీక్షించేందుకు ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. ప్రతీ ఏటా చైత్ర శుద్ధ సప్తమి న అభిజిత్ లగ్నంలో శ్రీవారి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. రెండు రోజులుగా పెండ్లికొడుకు, పెండ్లి కుమార్తెలుగా, ఎదుర్కోలు ఉత్సవం అనంతరం నిత్య కల్యాణ శోభితుడైన శ్రీవారు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అలివేలు మంగ, పద్మావతిలను పాణిగ్రహణం గావించారు. కల్యాణఘట్టం జరుగుతున్నంత సేపు కల్యాణవేదిక ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఉప్పల వంశీయుల వారికి మాత్రమే సొంతమైన ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. ఉదయం నుంచే వంశపారంపర్యంగా వస్తున్న విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వరపూజ, పాదప్రక్షాళన, మధుపర్కములు, మాంగళ్యపూజ, ముత్యాల తలంబ్రాల పూజలను ఆలయ సాంప్రదాయంలో నిర్వహించారు. వచ్చిన భక్తులకు దాతల సహకారంతో తాగునీరు. మజ్జిగ అందించారు. గ్రామ పంచాయతీ తరపున డీపీవో హరికిషన్ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నుంచి వచ్చిన పట్టువస్త్రాలను ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు దంపతులు అందించారు. ఇక సాయంత్రం ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మల దంపతుల ఆర్థిక సహకారంతో జమలాపురం గ్రామ చెరువులో హంసవాహనంపై శ్రీవారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ ఘట్టం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో దాతలు ముల్పూరి శ్రీనివాసరావు, వేజండ్ల సాయికుమార్, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకసారి మోసపోయాం.. పునరావృతం కావొద్దు

- తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- మళ్లీ ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా
- పాల్వంచలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

7


మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

క్రికెట్ బెట్టింగ్ ఆటకట్టు

నిర్వాహకుల ఖాతాల్లోని రూ.7.66లక్షలు సీజ్ 7


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఎల్లుండి నుంచే నామినేషన్ల పర్వం

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే అనుమతి
- డిపాజిట్ రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.12,500
- ఖమ్మం లోక్‌సభ స్థానం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఈ నెల 18నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించి నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 21న ఆదివారం మినహా, మిగతా 7 రోజులు ఉదయం 11.00 గంటల నుంచి మ. 3.00గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి సంబంధించి 3వాహనాలు మాత్రమే అనుమతించనున్నట్టు తెలిపారు. మిగతా వాహనాలు 100మీటర్ల దూరంలో ఉండాలన్నారు. నూతన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నట్టు రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ప్రతిపాదితులు ఉండాలన్నారు. పోటీచేసే అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండవచ్చని, ప్రపోజర్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లో ముద్రణకు గుర్తులు ఎన్నికల సంఘం కేటాయిస్తుందని, ఫొటోల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 26న కలెక్టర్ ఛాంబర్‌లో స్క్రూటినీ ప్రక్రియ చేపటనున్నట్లు తెలిపారు. 29 వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

అభ్యర్థులకు కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఇటీవలె నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలను అందుబాటులో ఉంచినట్లు, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నామినేషన్ ఫారం-2ఏలో, అఫిడవిట్ ఫారం-26లో సమర్పించాలన్నారు. అఫిడవిట్‌లో అన్ని కాలమ్‌లు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు విషయమై తాజా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఎన్నికల సంబంధ లావాదేవీలన్ని ఈ ఖాతా ద్వారానే జరపాలన్నారు. అభ్యర్థికి రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాలని తెలిపారు. అన్ని రకాల అనుమతుల కొరకు సువిధ సింగిల్ విండో ద్వారా దరఖాస్తు చేయాలని, దరఖాస్తు 48గంటల ముందస్తుగా చేయాలని ఆయన అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ స్వీకరణ చెక్ లిస్ట్ అందజేసి, దాని ప్రకారం సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జడ్పీ సీఈవో వినోద్, డీటీవో సత్యనారాయణ, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, బి.బాలరాజు, జీఎస్ఆర్‌పి. విద్యాసాగర్, వై.విక్రం, ఎన్.సత్యంబాబు, చీకటి రాంబాబు, పాలడుగు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

- నీరు వృథా కాకుండా పర్యవేక్షణ చేయాలి: ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్
- దానవాయిగూడెం, లకారం వద్ద నీటి నిల్వల పరిశీలన 7


కాలిపోయిన మామిడి తోటను చూపుతున్న బాధిత రైతు కుటుంబం

పంట పొలాల్లో రాజుకున్న నిప్పు

- మూడెకరాల మామిడి తోట, 7 ఎకరాల మొక్కజొన్న దగ్ధం
- సుమారు రూ.10లక్షల నష్టం... నాగులవంచలో ఘటన.. 7

అపూర్వం.. అద్వితీయం శిల్పకళా మండపం



తెలుగువారి ఆరాధ్య దైవమైన భద్రాద్రి రాముని కల్యాణానికి లోకమంతా పులకరిస్తుంది. ఆ స్వామి కల్యాణం కనులార వీక్షించాలని లక్షలాది మంది భక్తులు భావిస్తారు. అయితే దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కల్యాణం ప్రతీ ఏటా మిథిలా స్టేడియం ప్రాంగణంలోని శిల్పకళా శోభితమైన కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. ఈ కల్యాణ మండపానికి 1960 మే 30న అప్పటి దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి శంకుస్థాపన చేయగా.. 1964 ఏప్రిల్ 6న నీలం సంజీవరెడ్డి కల్యాణ మండపాన్ని ఆవిష్కరించారు. ఈసారి స్వామి వారి కల్యాణం బుధవారం ఇదే వేదికపై నిర్వహించనుండగా శ్రీరామ మహా పట్టాభిషేకం గురువారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కల్యాణ మండప శిల్పకళా నైపుణ్యంపై ఫోకస్...

- భద్రాచలం

భద్రాద్రికి 238 ప్రత్యేక బస్సులు

- శ్రీరామనవమి ఉత్సవాలకు ఆర్టీసీ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్టాండ్ల నుంచి ప్రత్యేక సర్వీసులు
- నేటినుంచి 18వరకు సదుపాయం
- మహిళలకు ఉచిత ప్రయాణం
- సమీక్ష సమావేశంలో ఆర్ఎం వెంకన్న

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 15: భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మంగళవారం నుంచి 18వరకు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్టాండ్లనుంచి భద్రాచలానికి 238 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. నగరంలోని నూతన బస్టాండ్‌లో ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ అధికారులతో సోమవారం సమీక్ష, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలులో ఉన్న నేపథ్యంలో భద్రాచలంలో నిర్వహించే శ్రీరామ నవమి ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉండడంతో భక్తులకు ఎలాంటి రవాణా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని తెలిపారు. భద్రాచలం బస్టాండ్ నుంచి పర్ణశాలకు రెగ్యులర్‌గా నడుస్తున్న సర్వీస్‌లతోపాటు ప్రయాణికుల రద్దీని బట్టి ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఖమ్మం నుంచి నడిచే రెగ్యులర్ సర్వీస్‌లతోపాటు ప్రత్యేక సర్వీస్‌లు నడుస్తాయని తెలిపారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఏపీ నుంచి వచ్చే బస్సులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అక్కడినుంచి ప్రత్యేకంగా మినీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు.ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఉచిత ప్రయాణం, ఇతర ప్రయాణికులకు రూ.10 టికెట్ ఉంటుందని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇతర రీజియన్‌ల నుంచి 40మంది సెక్యూరిటీ సిబ్బందిని విధులకు కేటాయించామన్నారు.

ప్రత్యేక బస్సులకు నియమించిన అధికారులు

భద్రాచలానికి భద్రాచలం డిపో మేనేజర్ 9959225960, డిపో మేనేజర్ మధిర 9959225961, పర్ణశాలకు డిపో మేనేజర్ మణుగూరు 9959225963, ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు డిపో మేనేజర్ సత్తుపల్లి 9959225962, కొత్తగుడెంకు డిపో మేనేజర్ కొత్తగుడెం 9959225959, ఖమ్మంకు డిపో మేనేజర్ ఖమ్మం 9959225958, మణుగురుకు అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ మణుగూరు 7382858121, సత్తుపల్లికి అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ సత్తుపల్లి 6303561217, మధిర సూపరింటెండెంట్ ట్రాఫిక్ మధిర 8790014668 నెంబర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగితే ఈ నెంబర్లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటి రీజనల్ మేనేజర్ (మెకానికల్)భవాని ప్రసాద్, డిప్యూటి రీజనల్ మేనేజర్ (ఆపరేషన్) పవిత్ర, డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం

శ్రీరామనవమి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల కోసం భద్రాచలం బస్టాండ్‌లో ప్రత్యేక వైద్యశిబిరం ఈ నెల 17, 18తేదీలలో ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరిసింహారావు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ ఉద్యోగులు కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు.

శ్రీరామనవమి సెక్టార్ ప్లాన్ ఇదే..

- కల్యాణాన్ని తిలకించేందుకు 31,860 మందికి అవకాశం
- 20 అత్యవసర ద్వారాలు, 9 ప్రవేశ ద్వారాలు, 4 బయటకు వెళ్లే ద్వారాలు



భద్రాచలం, ఏప్రిల్ 15:భద్రాచల రామయ్యకు బుధవారం మిథిలా స్టేడియంలోని శిల్పాకళా శోభితమైన కల్యాణ మండపంలో కల్యాణం నిర్వహించనున్నారు. దీంతో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. సెక్టార్ ప్లాన్ సైతం రూపొందించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఇతర ప్రముఖులు, టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు రానుండటంతో అందుకు అనుగుణంగా ప్రత్యేక సెక్టార్లు రూపొందించారు.మిథిలా స్టేడియంలో మొత్తం 24సెక్టార్లు ఉండగా 31,860మంది స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అవకాశముంది. ఇందులో 16860మంది టికెట్లు కొనుగోలు చేసినవారు కాగా.. స్టేడియంపై భాగంలో ఉన్న గ్యాలరీ ద్వారా 15,000మంది స్వామివారి కల్యాణాన్ని ఉచితంగా తిలకించే అవకాశముంది. భక్తులు 20 అత్యవసర ద్వారాల ద్వారా బయటకు వెళ్లేందుకు అవకాశముండగా, 9 ద్వారాల నుంచి లోపలికి ప్రవేశించేందుకు 4ద్వారాల నుంచి బయటకు వెళ్లే అవకాశముంది.సెక్టార్ల పనులు పూర్తయిన అనంతరం ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి దేవస్థానం అధికారులు ఎటువంటి ఇబ్బందులు లేవని ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంది.

ఎంతో రుచిరా..!

- నిత్యం రామయ్యకు నివేదనలో ఎన్నో ప్రసాదాలు
- కదంబానికి జాతీయ ఖ్యాతి



భగవంతుడిని ఆరాధించే సమయంలో ప్రసాదాలు సమర్పించి నివేదన చేయడం సర్వసాధారణం. అయితే దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామికి ప్రతినిత్యం ఎన్నో రకాల ప్రసాదాలు నివేదన చేస్తూ ఉంటారు. సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు ఎన్నో రకాల పూజలనూ నిర్వహిస్తారు. అయితే రామయ్యకు ప్రసాదాలు నైవేద్యం చేసే సమయంలో ప్రత్యేకత ఉంది. సుప్రభాత సేవ సమయంలో.. బాలబోగం, రాజబోగం, ప్రభుతోత్సవం, పవళింపుసేవ ఇలా ఒక్కొక్క సేవలో ఒక్కో రకమైన ప్రత్యేక ప్రసాదాన్ని స్వామికి నైవేద్యం చేస్తారు. ఇందుకోసం రామాలయంలోని వంటశాలలో స్వామివారికి ప్రత్యేక ప్రసాదాలు తయారు చేసేందుకు వంట సిబ్బంది ఉన్నారు. వారు కేవలం స్వామివారికి సంబంధించిన ప్రసాదాలను మాత్రమే తయారు చేస్తారు.

భద్రాచలం, ఏప్రిల్ 15: తెల్లవారుజామున భద్రాద్రి రామాలయం తెరిచిన వెంటనే సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి పాలు, జీడిపప్పు, పంచదార, కిస్మిస్, సొంఠిచెక్కర నివేదన చేస్తారు. స్వామివారికి తరువాత నిర్వహించే బాలబోగంలో చెక్కెర పొంగలి, కట్టెపొంగలి, దద్దోజనం, సొండెలు నైవేద్యంగా సమర్పిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు రాజబోగంలో తెల్లప్రసాదం, పులిహోర, పప్పు, సాంబారు, పెరుగు, ఏదైనా ఒక శాకము సమర్పిస్తారు. దర్బారు సేవ అనంతరం జరిగే నివేదనలో సొండెలు స్వామివారికి సమర్పిస్తారు. శుక్రవారం అద్దాల మండపంలో జరిగే దర్బారు సేవ సమయంలో సొండెలు, రవ్వకేసరి లేదా చెక్కర పొంగలి విశేష నైవేద్యం సమర్పిస్తారు. రాత్రి బోగంలో కట్టెపొంగలి, చిట్టి గారెలు, అప్పాలు, తమలపాకులను చిలకలుగా చుట్టి నైవేద్యం పెడతారు. అయితే ఈ ప్రసాదాలను స్వామివారికి నైవేద్యం పెట్టేందుకు కూడా ప్రత్యేక సమయం ఉంటుంది. ఆ సమయాల్లోనే వాటిని స్వామివారికి ఆరగింపు చేసి అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు. కాగా ప్రత్యేక పండుగ పర్వదినాల్లో మరికొన్ని ప్రసాదాలను స్వామివారికి నివేదన చేస్తారు. వీటిలో పాయసం, కదంబం, పులిహోర, కలిహోర, మెలిహోర, నువ్వోర, శనగపప్పు ఉండలు, నువ్వుల ఉండలు, కాయం, బూరెలు ఉన్నాయి.

భద్రాద్రి కదంబానికి జాతీయ ఖ్యాతి

వైకుంఠ ఏకాదశి అనంతరం స్వామివారికి నిర్వహించే విశ్వరూప సేవలో స్వామివారికి నివేదన చేసే ప్రసాదాన్ని కదంబం అంటారు. ఈ ప్రసాదానికి జాతీయ స్థాయిలోనే ఎంతో ప్రత్యేకత ఉంది. అన్ని రకాల కూరగాయలు, మూడు రకాల పప్పులు, నెయ్యి, జీడిపప్పు, పల్లీలు తదితర వాటిని ఇందులో వినియోగిస్తారు. అత్యంత రుచికరమైన ఈ ప్రసాదాన్ని స్వామివారికి నివేదించిన అనంతరం దానిని స్వీకరించేందుకు భక్తులు పోటీలు పడతారు. జన్మలో కనీసం ఒక్కసారైనా ఈ ప్రసాదాన్ని స్వీకరించాలని భక్తులు భావిస్తారు.

కృష్ణాష్టమికి నాలుగు రకాల పులిహోర వంటకాలు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని భద్రాద్రి రామాలయంలో నాలుగు రకాల పులిహోర వంటకాలను తయారు చేస్తారు. ఇందులో పులిహోర, ఆవాలతో చేసేది కలిహోర, మిరియాలతో చేసే మిలిహోర, నువ్వులతో చేసే నువ్వోరలు ఎంతో రుచికరంగా ఉంటాయి. వీటిని సైతం స్వామివారికి నివేదన చేసి అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు. అయితే ఇదే సమయంలో శనగపప్పు ఉండలు, నువ్వుల ఉండలు, కాయం తయారు చేస్తారు.కాయం ప్రసాదాన్ని తింటే వాత ప్రకోపాలు తగ్గుతాయనేది నానుడి.

శ్రీరామనవమి నాడు...

శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం అభిజిత్ లగ్నంలో జరిగిన అనంతరం స్వామివారు కోవెలకు వచ్చినప్పుడు వడపప్పు, పానకం ప్రత్యేకప్రసాదంగా నివేదన చేస్తారు. ఇదిలా ఉండగా రామయ్య జన్మదినంనాడే కల్యాణం చేసుకుంటాడు. అయితే ఈ సమయంలో స్వామివారికి లడ్డూని ఆరగింపు చేస్తారు. బహుళ ఏకాదశినాడు చెక్కర పొంగలి మధ్యాహ్నం 2 గంటల సమయంలో స్వామివారికి నివేదన చేస్తారు. అలాగే తిరునక్షత్రాల సమయాల్లో చెక్కర పొంగలి స్వామివారికి నైవేద్యంగా పెడతారు.



నూతన వారధిపై జిల్లా అధికారులు

కల సాకారమైన వేళ

- భద్రాచలం వద్ద గోదావరి రెండో వారధిపై రాకపోకలు షురూ
- ప్రారంభించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాద్రి వాసుల దశాబ్దాల కల సాకారమైంది. భద్రాచలం వద్ద గోదావరి రెండో వారధిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. విజయవాడ నుంచి జగదల్‌పూర్ జాతీయ రహదారిలో 166వ కిలోమీటరు వద్ద ఈ వంతెన నిర్మాణం జరిగింది. 2014లో ఈ బిడ్జికి టెండర్ల ప్రక్రియ జరగ్గా 2015 ఏప్రిల్ ఒకటిన పనులు ప్రారంభమయ్యాయి. రూ.65కోట్లతో ఈ వారధిని నిర్మించారు. మొత్తం 2.3కి.మీ. నిర్మాణంలో 1.25 కి.మీ. పొడవున వంతెన ఉంటుంది. మిగిలింది అప్రోచ్ రహదారిగా ఉంది. 7.5 మీటర్ల వెడల్పు, 37పిల్లర్లతో వంతెన నిర్మాణం చేశారు. పదేళ్ల క్రితం ఈ బిడ్జి నిర్మాణం ప్రారంభించగా మొదట్లో పనులు నత్తనడకన సాగాయి. దాంతో అప్పటి ప్రభుత్వం మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు వేగవంతం చేసిన తరువాత మళ్లీ పనులు ఆగిపోయాయి. అయితే గత ఏడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలం పర్యటనకు వచ్చిన క్రమంలో శ్రీరామనవమి నాటికి రెండో వారధిపై వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. తరువాత కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో పాటు జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి శ్రీరామనవమి నాటికి భద్రాచలం వద్ద రెండో వారధిని అందుబాటులోకి తెచ్చారు. బిడ్జి పనులు పూర్తి కావడంతో రెండో వారధిపై రాకపోకలను సారపాక వైపు నుంచి భద్రాచలం వైపునకు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ప్రారంభించారు. ఈ క్రమంలో కలెక్టర్ తన వాహనంలో వారధిని దాటారు. అంతకు ముందు గోదావరి రెండో వారధి వద్ద కలెక్టర్ ప్రియాంక ఆలాతో పాటు ఇతర అధికారులతో భద్రాద్రి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాకపోకలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, జాతీయ రహదారుల శాఖ ఈఈ యుగందర్, డీఈ శైలజ, భద్రాచలం ఆర్డీవో కె.దామోదర్‌రావు పాల్గొన్నారు.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగం

భద్రాచలం వద్ద గోదావరిపై రెండో వారధి నిర్మాణంతో తెలంగాణవాసులతో పాటు ఎగువన ఉన్న ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వల్ల భద్రాచలం వాసులకు ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించనుంది. 59 ఏళ్ల క్రితం గోదావరిపై భద్రాచలం వద్ద తొలి వారధిని నిర్మించగా అప్పటి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ దాన్ని ప్రారంభించారు. అయితే కాలక్రమంలో భద్రాద్రికి భక్తుల రద్దీ పెరిగిపోవడంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు భారీగా వాహనాలు పెరగడంతో ఈ బ్రిడ్జి ఎంతగానో ఉపయోగపడనుంది.

పర్ణశాలలో ఘనంగా ధ్వజారోహణం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 15: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ పర్ణశాల రామాలయంలో సోమవారం ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు గరుడప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి తిరువీధిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్, ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, సీతారామానుజాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది రాము, శివలు పాల్గొన్నారు. పాల్వంచకు చెందిన స్వరూప్, శ్రీదేవి దంపతులు స్వామివారికి రూ.20వేల విలువల గల రెండు గొడుగులను సమర్పించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

రక్షణ వలయంలో భద్రాద్రి

- ఎస్పీ పర్యవేక్షణలో 1800 మంది సిబ్బందితో బందోబస్తు
- సాయుధ పోలీసుల విస్తృత తనిఖీలు

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భద్రాచలంలో పోలీసు శాఖ కనీవిని ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో 1800 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. ఇందుకోసం పోలీసు సిబ్బంది అంతా సోమవారం భద్రాచలం చేరుకున్నారు. వీరి కోసం పోలీసు స్టేషన్ ప్రాంగణం, తానీషా కల్యాణ మండపంతో పాటు పలు చోట్ల వసతి ఏర్పాటు చేశారు. బందోబస్తుకు నవమి/పట్టాభిషేకానికి అదనపు ఎస్పీలు ఇద్దరు, 13 మంది డీఎస్పీలు, 55 మంది సీఐలు, 155 ఎస్ఐలు, 800 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 150 మహిళా కానిస్టేబుళ్లు, 330 హోంగార్డులతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వుడు సెక్షన్లు, బాంబ్ డిస్పోజబుల్ బృందాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలైన ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కలిగిన భద్రాచలంలో కల్యాణం, శ్రీరామ మహా పట్టాభిషేకంను పురస్కరించుకొని పోలీసులు కల్యాణంకు 40 గంటల ముందు నుంచే భద్రాచలం చేరుకునే అన్ని మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బ్రిడ్జి రోడ్డు, కూనవరం, చర్ల రహదారులతో పాటు ఆర్టీసీ బస్‌స్టాండు, అన్ని లాడ్జిలు, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్వామి వారి కల్యాణం జరిగే కల్యాణ మండపం పూర్తిగా పోలీసుల భద్రతా వలయంలో ఉండనుంది. కల్యాణ మండపం మొత్తం డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ బృందాలతో అణువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే రామాలయంలో తూర్పు, పడమర మెట్లవైపు ఉన్న ప్రవేశ ద్వారాల వద్ద భక్తులను తనిఖీలు నిర్వహిస్తున్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

రామయ్య భక్తుల కోసం క్యూఆర్ కోడ్

● పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపకల్పన

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి, శ్రీరామ మహాపట్టాభిషేకాలను పురస్కరించుకుని రామయ్య భక్తుల కోసం క్యూఆర్ కోడ్‌ను జిల్లా పోలీసు అధికారులు అందుబాటులోకి తెచ్చారు. శ్రీరామనవమి సమయాన గత ఏడాది జిల్లా అధికార యంత్రాంగం ఈ విధానాన్ని తొలిసారిగా అమలు చేసింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూఆర్ కోడ్‌ను తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో స్కాన్ చేసి వారికి కావలసిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. పార్కింగ్ స్థలాలు, తలంబ్రాల పంపిణీ కేంద్రాలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, రామాలయంకు వెళ్లే మార్గాలు, కల్యాణ మండపానికి వెళ్లే మార్గం, తాగునీటి సౌకర్యం తదితర వాటికి సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో పొందుపరిచారు.

శ్రీరామనవమి సమాచార పత్రం ఆవిష్కరణ

● ఆవిష్కరించిన దేవవాయశాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్, ఎస్పీ, పీవో, ఈవో

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తుల కోసం అధికార యంత్రాంగం సమాచారపత్రాన్ని రూపొందించింది. ఈ సమాచార పత్రాన్ని దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలు ఆవిష్కరించారు. ఇందులో భక్తులకు ఉపయోగపడే సమాచారం ఉందని ఇది అందరికి చేరవేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

నిత్యాన్నదానికి రూ.50వేల విరాళం



డాక్టర్ సీతారామరాజుకు నిత్యాన్నదాన బాండ్ అందజేస్తున్న పర్యవేక్షకులు

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలంలోని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నిత్యాన్నదాన పథకానికి భద్రాచలం మెడిలైఫ్ ఆసుపత్రి వైద్యులు బీవీ సీతారామరాజు, కృష్ణవేణి దంపతులు రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, దేవస్థానం అన్నదానం బాండ్‌ను డాక్టర్ సీతారామరాజుకు అందజేశారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 15 : కొత్తగూడెంలోని పాండురంగభజనమందిరంలో శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారురఝాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని విగ్రహ ప్రతిష్ఠ, హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదమంత్రోచ్చరణలు, శ్రీరామ రామనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం నారాయణ సేవ (అన్నదాన) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రుక్మాందర్ బండారి, బాలిశెట్టి సత్యభామ, అర్చకులు దినేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

ల్యాబ్ టెక్నీషియన్ శిక్షకులకు సర్టిఫికెట్ల అందజేత

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15: ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఏడాది పాటు ల్యాబ్ టెక్నీషియన్ ట్రైనింగ్ (అప్రెంటీస్) చేసిన 30 మంది విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నీషియన్‌గా మెళకువలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, మెడికల్ కాలేజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, మెడికల్ కాలేజ్ ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాబూరత్నాకర్, డాక్టర్ రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలను అందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి26 నుంచి మార్చి1 వరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్ తదితరాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పోస్టర్ తయారీ విభాగంలో ఖమ్మం జిల్లా వరంగల్ క్రాస్ రోడ్ లోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సఫురా, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస రెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ, ఆర్ఎంవో రాజశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మైనార్టీ అభ్యర్థుల ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడి సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సీస్యాట్ 2025 పరీక్ష కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 97040 03002 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 15: మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీర్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 19లోగా దరఖాస్తులను నూతన కలెక్టరేట్ భవనంలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

అడవులపై నిరంతర నిఘా ఉండాలి: సీసీఎఫ్ భీమానాయక్

ఇల్లెందురూరల్, ఏప్రిల్15: అడవుల సంరక్షణపై అటవీశాఖ ఉద్యోగులు నిరంతర నిఘా ఉండాలని సీసీఎఫ్ భీమానాయక్ సూచించారు. సోమవారం ఇల్లెందు మండలంలోని జోడు బావులు బీట్ పరిధిలోని అడవులను, నర్సరీలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టీటీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా విజయ్


విజయ్, సాంబమూర్తి

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఇద్దరు జిల్లా వాసులకు చోటు దక్కింది. అసోసియేషన్‌లో కీలకమైన రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్ కుమార్‌ను ఎన్నుకోగా, కార్యనిర్వాహక సభ్యుడిగా జిల్లా సెక్రటరీ ఓలేటి సాంబమూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ మల్లారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర టేబుల్ టెన్నిస్ నూతన కార్యవర్గ సమావేశంలో ధ్రువీకరించారు. ఈ సందర్భంగా వారిని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా టీటీ అసోసియేషన్ ప్యాట్రన్స్ డాక్టర్లు ఎంజీవి. ప్రవీణ్‌కృష్ణ సుమంత్, రవికుమార్, శశికుమార్, కూరపాటి ప్రదీప్‌లు అభినందించారు.

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

» జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్


కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ట్యాంకును పరిశీలిస్తున్న సురేంద్రమోహన్ ఐఏఎస్

కొణిజర్ల, ఏప్రిల్ 15: మండుతున్న ఎండల దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్ సూచించారు. మండలంలోని చిన్నగోపతి, కొణిజర్ల గ్రామాలలో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ముందుగా చిన్నగోపతిలో పోలింగ్‌కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు గురించి అధికారులతో మాట్లాడారు. అనంతరం కొణిజర్లలో మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరిశీలించి, స్థానికులకు మజ్జిగ ప్యాకెట్లును పంపిణి చేశారు. కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో సౌకర్యాలను పరిశీలించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

అక్కడే గల ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. వాటర్ సరఫరా ఏ విధంగా చేస్తున్నారని మిషన్ భగీరథ అధికారులను అడిగితెలుసుకున్నారు. స్థానికులతో తాగునీటి సమస్య ఉందా అని అడిగితెలుసుకొని వారు నీళ్ల మంచిగానే వస్తున్నాయని చెప్పడంతో నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివ కుమార్, ఈఈ పుష్పలత, డీఈ నవీన్‌కుమార్, ఏఈలు సతీష్‌కుమార్, చైతన్యకుమార్, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో రోజారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి ఖమ్మంజిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కే.సురేంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఆయన నగరపాలకసంస్థ పరిధిలోని దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ వద్ద నీటి నిల్వలను స్థానికసంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ మాట్లాడుతూ పాలేరు జలాశయం నుంచి విడుదల చేసిన నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాలన్నారు. నీటిని వృధాకానివ్వకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు.

దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌కు వచ్చిన నీటిని నగరపాలకసంస్థ పరిధిలోని అన్ని డివిజన్లకు షెడ్యూల్ ప్రకారం సరఫరా చేయాలన్నారు. అనంతరం 60వ డివిజన్ రామన్నపేటలో ప్రభుత్వ ఉన్నతపాఠశాల, నగరంలోని శాంతినగర్ పాఠశాలలోని అమ్మ ఆదర్శపాఠశాలలను సందర్శించి అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లి, అక్కడి ఎస్ఎస్ ట్యాంక్‌లో నీటినిల్వలను పరిశీలించారు. ఆయన వెంట శిక్షణా సహాయ కలెక్టర్లు మ యాంక్‌సింగ్, యువరాజ్, పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, నగరపాలకసంస్థ ఈఈ కృష్ణాలాల్, అధికారులు ఉన్నారు.

ఒకసారి మోసపోయాం...పునరావృతం కావొద్దు

● బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నామా

పాల్వంచ, ఏప్రిల్15: ఒకసారి మోసపోయాం.. అది పునరావృతం కాకూడదని, జాగ్రత్తగా వ్యవహరించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఖమ్మం లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పాల్వంచ లారీ అసోసియేషన్ హాల్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్ అధ్యక్షతన సోమవారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ తాతా మధు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలన్నా, తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఈ సారి నామాను రెండు లక్షల మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ గెలువబోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయని, మరో నాలుగు స్థానాల్లో ఢీ అంటే ఢీ గా పోటీపడుతున్నామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్లూరి జీవన్, బరపటి వాసుదేవరావు, కిలారు నాగేశ్వరరావు, నాయుడు, సరస్వతి, గురవయ్య, రవి, మంజుల, శంకర్, వీరయ్య, శోభారాణి, విశ్వనాధం, శ్రీరామ్మూర్తి, కనకేష్, ఆచార్యులు, సింహాద్రి యాదవ్, గోపి, ఎంపీటీసీలు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధి

ఖమ్మం కార్పొరేషన్: జిల్లాలో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో తన భాగస్వామ్యం ఉందని, ఎన్నోసార్లు కేంద్రమంత్రుల వెంటబడి జిల్లాకు రూ.8వేల కోట్ల విలువైన జాతీయ రహదారులను తీసుకువచ్చానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బ్యాంక్‌కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో బీఆర్ఎస్ నాయకుడు మోతారపు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ఈ సమ్మేళనంలో ఇంకా కార్పొరేటర్ మోతారపు శ్రావణి, నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, మోరంపూడి ప్రసాద్, చిత్తారు సింహాద్రియాదవ్, వెంకటాచారి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ఆటకట్టు

● రూ.7.66 లక్షల సీజ్

సత్తుపల్లి, ఏప్రిల్ 15: క్రికెట్ బెట్టింగ్, పేకాట, ఇతర కేసులలో అవసరమైతే నేర చరిత్రను బట్టి నిందితులపై హిస్టరీ షీట్ ఓపెన్ చేస్తామని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు చెప్పారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా నిర్వహకులు మరో 10మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం రాత్రి సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ అర్ధరాత్రి సమయంలో సత్తుపల్లి మండలం సత్యంపేటలోని ఏగోటి పెద్దిరాజుకు చెందిన కొబ్బరి తోటలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరు మైనర్లతో పాటు అశ్వారావుపేటకు చెందిన ఆకుల శేఖర్, ఆకుల వెంకీ అలియాస్ వెంకటేశ్వరరావులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

కేసు విచారణలో భాగంగా క్రికెట్ బెట్టింగ్‌తో మరో 10మందికి సంబంధాలు ఉన్నట్లు తేలిందన్నారు. వీరిలో ఏగోటి పెద్దిరాజు, శివ, అవినాష్, చిన్ని, శ్రీధర్, రాము, సూర్య, ఎస్‌కే.రఫీ, మాస్టర్, డీపీ, సాయిలు పరారీలో ఉన్నారని తెలిపారు. మొత్తం ఈ కేసులో 14మంది నిందితులకుగాను నలుగురిని అరెస్ట్ చేశామని, మరో 10మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. అరెస్ట్ అయిన నలుగురి వద్ద నుంచి రూ.13,260నగదుతో పాటు డెల్ కంపనీకి చెందిన ఒక ల్యాప్‌టాప్, 4సెల్‌ఫోన్స్, ఒక నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో పరారీలో ఉన్న 10మందిలో పెద్దిరాజు, శ్రీధర్, ఎస్‌కే.రఫీలకు చెందిన బ్యాంక్ ఖాతాలోని రూ.7,66,443నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, ఏప్రిల్ 15: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో సోమవారం వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని వీ.వెంకటాయపాలేనికి చెందిన చేబ్రోలు బాబూరావు(45) వ్యాన్ కొనుగోలు చేసి తానే డ్రైవర్‌గా పనిచేస్తూ బాడుగలకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

ఈ క్రమంలో వడదెబ్బతో అస్వస్థతకు గురైన బాబూరావు సోమవారం ఇంటి వద్దనే మృతి చెందాడు.

పంట పొలాలకు నిప్పు

● మూడెకరాల మామిడితోట, 7 ఎకరాల మొక్కజొన్నదగ్ధం


కాలిన మొక్కజొన్న తోటను చూపుతున్న బాధిత రైతు కుటుంబం

చింతకాని, ఏప్రిల్ 15: ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో సోమవారం పంట పొలాలకు నిప్పంటుకుని పలువురు రైతులకు సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. గ్రామంలోని మరికుంట డొంక పొలాల్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గ్రామానికి చెందిన రైతు రౌతు నరేష్‌కు చెందిన రెండు ఎకరాల మామాడి తోట, నంబ్యాల నర సింహరావు, సామినేని బాబురావు ఎకరం మామిడి తోటతో పాటు, కౌలు రైతు దేశబోయిన నాగేశ్వరరావుకు చెందిన 4 ఎకరాల మొక్కజొన్న పంట మరికొంత మంది రైతులకు చెందిన 3 ఎకరాల మొక్కజొన్న పంట పాక్షికంగా కాలిపోయింది. పంట పొలాలకు నిప్పంటుకున్న విషయాన్ని గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు సమాచారం. పంట నష్టపోయిన రైతులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పాముకాటుతో మహిళ మృతి


జమున

దమ్మపేట, ఏప్రిల్ 15: పాముకాటుతో మహిళ మృతి చెందింది. మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన నారం జమున (50) తోటి కూలీలతో కలిసి మొక్కజొన్న పంటలో పనులు చేసేందుకు వెళ్లింది. పని చేసుకుంటుడగా పాము కాటేసింది. గమనించిన తోటి కూలీలు ఆమెను వెంటనే సత్తుపల్లి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నగదు స్వాధీనం

ములకలపల్లి, ఏప్రిల్ 15: మండలం మూకమామిడి క్రాస్ రోడ్డు వద్ద తనిఖీల్లో సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం ఇద్దరు వ్యక్తుల నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.1,50,150ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రాజమౌళి తెలిపారు.

మద్యం మత్తులో స్కూల్ బస్ డ్రైవర్

● డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

బూర్గంపాడు, ఏప్రిల్ 15: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బస్ డ్రైవర్, క్లీనర్ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పాల్వంచలోని నారాయణ స్కూల్‌కు చెందిన బస్సు బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్లేందుకు వచ్చింది. ఈ క్రమంలో బస్ డ్రైవర్, క్లీనర్ మద్యం సేవించడం గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు బస్‌ను అడ్డుకుని అధికారులకు, పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. దీంతో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీపురం గ్రామానికి చేరుకుని విద్యార్థులను మరోక డ్రైవర్ సాయంతో స్కూల్‌కు తీసుకెళ్లారు. మద్యం తాగిన డ్రైవర్, క్లీనర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వేడుకుంటున్నారు.

బోర్‌వెల్ వాహనం సీజ్

పాల్వంచ, ఏప్రిల్ 15: పాల్వంచ పట్టణ పరిధిలోని ఇందిరాకాలనీ ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో అక్రమంగా బోరు వేస్తున్నారనే సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటంతో బోరు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. సదరు వాహనాన్ని టింబర్ డిపోకు తరలించి కేసు నమోదు చేశామని పాల్వంచ రేంజి అధికారి అనిల్ తెలిపారు.

వంట బిల్లులు స్వాహా చేసిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గుండాల, ఏప్రిల్ 15: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండానే బిల్లులు చేసి నిధులు స్వాహా చేసిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. గుండాల మండల పరిధిలోని నాగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శంకర్ ఏడాది కాలంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకుండానే నిధులు స్వాహా చేసిన విషయం విదితమే. కాగా ఈ విషయమై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఎంఈవో పెండెకట్ల కృష్ణయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం ఎల్.రాములు నాగారం పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం బిల్లులతో పాటు ఎస్ఎంసీ తీర్మాణాలు లేకుండా పాఠశాల గ్రాంటు, ఏకరూప దుస్తుల గ్రాంటు స్వాహా చేసినట్లు వెల్లడైంది. ఈ ఏడాది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. నివేదికను జిల్లా అధికారులకు సమర్పించారు. కాగా నాగారం పాఠశాల ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో కృష్ణయ్య

లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేయాలి

● కలెక్టర్ గౌతమ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం నేపథ్యంలో అధికారులు ఎన్నికల సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఏఆర్వోలు వారి పరిధిలో వీఐపీ, వీవీఐపీల ఓటు, జాబితాలో ఉన్నది లేనిది పరిశీలించి, లేకపోతే, వెంటనే ఫారం-6 ద్వారా నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఆర్వోలు ఓటరు నమోదుకు అందిన దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. నామినేషన్ సహాయక కేంద్రాల నిర్వహణ చేయాలని, నామినేషన తర్వాత వాటినే ఓటరు సహాయక కేంద్రాలుగా కొనసాగించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 85 ఏళ్ల పైబడి హోం ఓటింగ్‌కు 2,466 మందిని గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో 7,513 మంది సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ జారీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, డీఆర్డీవో సన్యాసయ్య, జెడ్పీ సీఈవో వినోద్, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, మీనన్, రాంబాబు, సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 15: భర్త, అత్త పెట్టే వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన అల్లిక పున్నారావుకు, కొణిజర్ల మండలం, రామనర్సయ్య నగర్ గ్రామానికి చెందిన అల్లిక కవితతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అనంతరం వారు కుటుంబం ఖమ్మం రూరల్ మండలం, ఆటోనగర్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పున్నారావు చుట్టు పక్కల గ్రామాల్లో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. అయితే ఆదివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న కవిత సోదరుడు గుడిచుట్టు నాగరాజు వచ్చి తన చెల్లిని ఓదార్చి వెళ్లాడు. సోదరుడు వెళ్లిన తరువాత కూడా రాత్రి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆమె ఇంట్లోకి వెళ్లి బెడ్‌రూం తలుపులు వేసుకుంది. ఉదయాన్నే పున్నారావు ఆర్ఎంపీ వైద్య సేవలకు వెళ్లాడు. అప్పటికి ఆమె నిద్ర లేవలేదు. కాగా కవిత సోదరుడు నాగరాజు ఉదయం ఆమెకు ఎన్నిమార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. దీంతో అనుమానం వచ్చిన అతడు వెంటనే ఆటోనగర్‌లోని కవిత ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఆమె కుమారుడు ఏడుపు వినిపిస్తుంది. ఎంత కొట్టినా ఆమె తలుపులు తీయడం లేదు. అదే సమయంలో పున్నారావు ఇంటికి చేరుకున్నాడు. తలుపులు రాకపోవడంతో వెంటనే ఇద్దరు కలిసి గడ్డపారతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే కవిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉంది. కొన ఊపిరితో ఉన్న ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమెను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ ఐపీఎస్ మౌనిక పరిశీలించారు. కవిత భర్త పున్నారావు, అత్త భద్రమ్మల మానసిక వేధింపులే తన సోదరి కవిత మృతికి కారణమని కవిత సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి .....

రఘునాథపాలెం, ఏప్రిల్ 15: దుర అలవాట్లు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అర్బన్ బాలపేటకు చెందిన కణతాల వెంకన్న(40) దుర అలవాట్లుకు గురైన అతడు గ్రామంలో స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో భార్య భర్త మధ్య విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు రఘునాథపాలెం సరిహద్దులోని వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకన్నాడు. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మావోయిస్టు పార్టీ బంద్ ప్రశాంతం

చర్ల, ఏప్రిల్ 15: వరుస ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టు పార్టీ సోమవారం ఇచ్చిన ఒక్క రోజు బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్, సుకుమా, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాల్లో బంద్ ప్రభావం అధికంగా కనిపించింది. వ్యాపార దుకాణాలు, పెట్రోల్ బంక్‌లు మూసివేశారు. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. భద్రాద్రి, ములుగు జిల్లాల్లో మావోయిస్టుల బంద్ పాక్షికంగా కనిపించింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిట్యాపుల్ క్యాంపుపై బాంబు దాడి

బంద్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చిట్యాపుల్ బేస్ క్యాంప్‌పై ఆదివారం రాత్రి మావోయిస్టులు దాడికి ప్రయత్నించారు. దూరం నుంచి రాకెట్ బాంబ్‌తో దాడి చేశారు. బలగాలు ఎదరు దాడి చేయడంతో మావోయిస్టులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఎవ్వరికీ నష్టం జరగలేదు.

సుకుమా జిల్లా కౌరుగట్టు, జబ్బగట్ల, బాతం గ్రామాలపై ఈనెల 12న పూవర్తి బేస్‌క్యాంపునుంచి బలగాలు రాకెట్ దాడులు చేశారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగా పేరుతో సోమవారం లేఖను విడుదలైంది. ఈ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని లేఖలో పేర్కొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలో మావోయిస్టుల బంద్ ప్రభావంతో మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ వారాంతపు సంతలపై పడింది. మండలంలోని తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో నిర్మాణ పనులకు సంబంధించిన వాహనాలను సీఐ అశోక్ మైదాన ప్రాంతానికి తరలించారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 15: గవర్నమెంట్ సిమెంట్ రోడ్డును ధ్వంసం చేసిన కేసులో నిందితుడైన ఎలక వెంకటేశ్వర్లుకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.గోపికానాగశ్రావ్య సోమవారం తీర్పు వెల్లడించారు. ఫిర్యాది వి.హనుమంతరావు కథనం ప్రకారం.. జూపెడ గ్రామంలో 2017 మార్చి6న నిందితుడు తన ఇంటి ముందు ఉన్న సిమెంట్ రోడ్డును 10 మీటర్ల వరకు ధ్వంసం చేశాడని తిరుమలాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి, పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అట్టికేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో వ్యక్తికి రెండు రోజుల జైలు ...

కొత్తగూడెం లీగల్, ఏప్రిల్ 15: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి (ఫుల్ అడిషనల్ చార్జి స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్) బత్తుల రామారావు జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. పాల్వంచ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జగన్నాథపురం సెంటరులో మార్చి 22న వాహన తనిఖీల్లో బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆరేం వెంకటేశ్వర్లు మద్యం సేవించినట్లు రుజువుకాగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో అతడు తన నేరం అంగీకరించగా రెండు రోజులు కారాగారా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 15: చర్ల రోడ్డులో గల వల్లపు రాంబాబు గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలోని సామాగ్రి మొత్తం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ప్రమాదానికి కారణా లు తెలియరాలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రించారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



యశ్వంత్

వైరా, ఏప్రిల్ 15: నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కనకగిరి సిరిపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. కనకగిరి సిరిపురం గ్రామానికి చెందిన కూరాకుల గోపి, భవాని దంపతులకు మణికంఠ(4), యశ్వంత్(16నెలలు) ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా యశ్వంత్ తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లి ఇటీవల ఓ దుస్తుల దుకాణంలో గుమాస్తాగా చేరింది. వారు పనికి వెళ్లిన సమయంలో నెమలి గ్రామంలో ఆమె తల్లి భద్రమ్మ వారిద్దరి ఆలనాపాలనా చూసుకుంటుంది. సోమవారం కూడా ఇద్దరి పిల్లలను ఆమె వద్ద వదిలి వారు పనికి వెళ్లారు. భద్రమ్మ ఇంట్లో నిద్రపోతుండగా పిల్లలు ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. కొంత సేపటికి ఆమె వచ్చి చూసేసరికి యశ్వంత్ కనిపించకపోయేసరికి చిన్నారి తల్లిదండ్రులకు ఆమె సమాచారం అందించింది. కాగా వారు వచ్చి పిల్లాడి కోసం వెతకగా నీటి సంపులో బాలుడి మృతదేహం కనిపించింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మారిన ప్రశ్నపత్రాలతో ఎస్ఏ2 పరీక్షలు

వైరా, ఏప్రిల్ 15: ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో మారిన ప్రశ్నాపత్రాలతో షెడ్యూల్ ప్రకారం సోమవారం ఎస్ఏ2 పరీక్షలు నిర్వహించారు. వాస్తవంగా 15వతేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 6నుంచి 9వతరగతి విద్యార్థులకు ఎస్ఏ2 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. వైరాకు సమీపంలోని మేరీ ఇమాక్యులేట్ స్కూల్లో షెడ్యూల్ కంటే ముందే యాజమాన్యం అత్యుత్సాహంతో ఈనెల 8,10తేదీల్లో ఆరు నుంచి తొమ్మిదోవ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో ఆరెండు ప్రశ్నాపత్రాలు బహిర్గతమయ్యాయి. ఈ క్రమంలో పరీక్షల షెడ్యూల్‌ను విస్మరించిన ఆ పాఠశాల యాజమాన్యం పరీక్షలు నిర్వహించడంపై డీఈవో సోమశేఖరశర్మ ఆదేశాల మేరకు కొణిజర్ల ఎంఈవో శ్యాంసన్ గత శనివారం ఆపాఠశాలలో విచారణ నిర్వహించి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. అదేరోజు ముందుగానే తయారు చేసిన రెండోసెట్ పరీక్షా పేపర్‌ను అదే రోజు రాత్రి ముద్రించి జిల్లాలోని అన్ని పాఠశాలలకు ప్రశ్నాపత్రాలను అందజేశారు. దీనికిగానూ విద్యాశాఖకు రూ.3 నుంచి రూ.4లక్షల వరకు భారం పడింది. ఈ మొత్తాన్ని విద్యాశాఖకు చెల్లించాలని మేరీ ఇమాక్యులేట్ పాఠశాల యాజమాన్యానికి ఇచ్చిన షోకాజ్ నోటీసులో ఆదేశించారు. సదరు పాఠశాల విద్యార్థులకు కూడా సోమవారం మళ్లీ ఎస్ఏ2 పరీక్షలు మారిన ప్రశ్నాపత్రంతో నిర్వహించారు.


విచారణ నిర్వహిస్తున్న ఎంఈవో శ్యాంసన్(ఫైల్)



కాంగ్రెస్‌లో పలు కుటుంబాల చేరిక



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15: రఘునాథపాలెం ఎంపీపీ భూక్య గౌరి ఆధ్వర్యంలో జీకే బంజర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్‌లు కాంగ్రెస్ కండువాలను కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో బాణోత్ బాలాజీ, బాదావత్ రవి, మాలోత్ హట్యా, మాలోత్ రమేశ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. మండల నాయకులు భూక్య లాల్ తదితరులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

- రామాలయల్లో కల్యాణానికి ఏర్పాట్లు
- చలువ పందిళ్లు ఏర్పాటు, విద్యుత్ దీపాలతో అలంకరణ

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్14: శ్రీరామనవమి మహోత్సవం సమీపిస్తుండటంతో నగరంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయాల్లో సందడి మొదలయ్యింది. భద్రాచలం దివ్యక్షేత్రంలో జరిగే కళ్యాణమహోత్సవానికి దీటుగా ఖమ్మం నగర వ్యాప్తంగా అనేకచోట్ల సీతారామ, ఆంజనేయ స్వామి వార్ల దేవాలయాల్లో కల్యాణోత్సవం జరిపిస్తారు. ఇందిరా నగర్‌లోని పర్ణశాల రామాలయం నగరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో ప్రత్యేకతను కలిగి ఉంది. వైరారోడ్ ప్రధాన రహదారిపై ఉన్న ఈ ఆలయంలో నవమి ఉత్సవాలకోసం పెద్ద ఎత్తున చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తారు. కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవాన్ని నిర్వహించే సంప్రదాయాన్ని ఆచరిస్తున్నారు. గాంధీచౌక్‌లో వ్యాపారులు నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. రైల్వేస్టేషన్ ఆవరణలోని సీతారామ ఆలయం ఆధ్వర్యంలో సైతం నవమి వేడుకలు ఘనంగా జరుపుతారు. వైరారోడ్‌లోని పవనసుత జలాంజనేయస్వామి, దేవాలయం, చెర్వు బజార్‌లోని పురాతన ఆంజనేయస్వామి దేవాలయం, బ్యాంకు కాలనీ, వీడీవోస్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి దేవాలయం, ఎన్నెస్పీ క్యాంపు, ప్రభాత్ టాకీస్, రిక్కాబజార్ తదితర ఆలయాల్లో నవమి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

కల్లూరు: స్థానిక పట్టణంలోని కప్పలబంధం రహదారి వైపున గల శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గత 50 సవంత్సరాల క్రితం ప్రతి గ్రామంలో శ్రీరామా నవమి వేడకలకు వీధి వీధిన చలువ పందిళ్లు ఏర్పాటు చేసేవారు. ఏటా సుమారు 2 వేలకు పైగా భక్తులు కళ్యాణ క్రతువును తిలికించటమే కాక తాటాకు పందిళ్ల కింద భక్తి పరవశం పొందుతారు.

కూసుమంచి: కూసుమంచి మండలంలో జీళ్లచెరువు గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 17తేదీన జరుగనున్న కల్యాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నమందు శ్రీసీతారాముల కల్యాణం జరిపించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. భద్రాచలంలోని ఆలయంలో నిర్వహించే మాదిరిగా ఇక్కడ కల్యాణం జరిపించడం ఆనవాయితీ వస్తుంది. కల్యాణ తంతు తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. శ్రీరామనవమి పురస్కరించుకుని ఇక్కడ మూడురోజుల పాటు జాతర జరుగుతుంది. తురకగూడెం, నర్సింహలగూడెం, నాయకన్ గూడెం, ఈశ్వరమాధారం, జక్కేపల్లి, తదితర గ్రామాల్లో కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తారు.

తల్లాడ: మండలంలోని పినపాకలో కోదండ రామలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లు భక్తబృందం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాట్లు చకచక పూర్తి చేశారు.



ఖమ్మం పర్ణశాల రామాలయం వద్ద ఏర్పాట్లు



పినపాకలో నవమి కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

చింతకాని: మండల పరిధిలోని నేరడలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయ, వెంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వంకాయలపాటి గోపయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, కొల్లి వెంకటప్పయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 14 కుంటల భూమిని వితరణ చేశారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

మధిరటౌన్: మధిర బంజారా కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం ప్రమీల విజ్ఞప్తి చేశారు. సోమవారం దేవాలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మేనెల 17 నుంచి 21వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ

కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని నెమలిపురి గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. శ్రీరామ నామాంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 8.26కు ధ్వజ స్థంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గింజల నర్సింహరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, ఎంపీటీసీ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.



19నుంచి బేతుపల్లి అంకమ్మతల్లి తిరునాళ్లు

సత్తుపల్లిరూరల్,ఏప్రిల్15: మండలంలోని బేతుపల్లిలో వేంచేసియున్న అంకమ్మ అమ్మవారి ఆలయంలో ఏప్రిల్ 19నుంచి 24వ తేదీ వరకు వార్షిక తిరునాళ్ల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి సోమవారం తెలిపింది. ఈనెల 19న శుక్రవారం మైలపట్నం, పుట్టబంగారంతో ప్రారంభమయ్యే తిరునాళ్ల 24న బద్దెగొర్రె, చంద్రపట్నం, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాళ్ల పూర్తవుతాయన్నారు.

బేతుపల్లి శివ పంచాయతన క్షేత్రంలో పూజలు

బేతుపల్లిలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత గౌతమేశ్వర స్వామి వారి శివ పంచాయతన క్షేత్రంలో సోమవారం భక్తులు పూజలు నిర్వహించారు. అలంకరణ, అష్టోత్తర శతనామావళి పూజ, అమ్మవారికి కుంకుమార్చన మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కల్లూరు, ఏప్రిల్ 15 మండలంలోని రఘునాథగూడెం గ్రామంలో సోమవారం వైభవంగా శ్రీకోదండరామస్వామి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8:26కు కోందండ రామస్వామివారి పరిహార దేవతా ప్రతిష్ఠాపన, ధ్వజ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ కమిటీ తరుపున మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. నామ ట్రస్టు తరుపున రూ.25వేలు అందజేశారు. ఆలయంలో అవసరమైన గ్రానేట్‌ను కూడా సండ్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులు పెడకంటి రామకృష్ణ, చల్లగొళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

రంజాన్‌కు మీ సహకారం మరువలేనిది

సీపీ సునీల్‌దత్‌ను సన్మానించిన ముస్లిం నాయకులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్15: పవిత్ర రంజాన్ మాసం ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఖమ్మంలోని మజ్జిద్ కమిటీల అధ్యక్షులు సీపీ సునిల్‌దత్‌ను కొనియాడారు. మీ సహకారంతోనే పండుగను ఎటువంటి గొడవలు లేకుండా జరుపుకున్నామన్నారు. ఈద్గా ప్రాంతాల్లో ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు చొరవ తీసుకొని సహకారం అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌రషీద్, అలీఖాన్, అఫ్సర్, అజీత్, అబ్దుల్ రెహమాన్, అఫ్జల్, మున్నాన్, మహబూబ్, షరీఫ్, హకీమ్, ఫరీద్‌ఖాద్రి, మాదార్, హిదయతుల్లాసబ్, షాబుద్దీన్, బడేసాబ్, సలీమ్, ఇషాక్, జానీ పాల్గొన్నారు.



సునీల్‌దత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

24 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

కామేపల్లి, ఏప్రిల్ 15: మండల పరిధిలోని బర్లగూడెం గ్రామంలో ఆర్ఆర్ఆర్‌మెమోరియల్ ట్రస్ట్, బీపీఎల్ 4 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఈనెల24న ప్రారంభమవుతాయని నిర్వహకులు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.35వేలు. రెండోబహుమతి రూ.15వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళ్యాణ్, మనోజ్, ప్రేమ్‌ను సంప్రదించగలరు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని కరుణగిరి వద్ద అల్లె సాయికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీపీబీఎల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావిద్ సోమవారం ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీపీఎస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి కిరణ్, 48వ డివిజన్ అధ్యక్షుడు బోజెడ్ల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, ఓబీసీ చైర్మన్ బానాల లక్ష్మణ్, జహీర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

బాలలను స్వేచ్ఛగా ఎదగనివ్వాలి

ఖమ్మంలీగల్, ఏప్రిల్15: భరతదేశ భవిష్యత్తు బాలలపైనే ఆధారపడి ఉంది కాబట్టి వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలని అదనపు జిల్లా న్యాయాధికారి(కుటుంబ న్యాయస్థానం) ఎం.అర్చనా కుమారి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాలల సదనంలోని బాలలతో న్యాయాధికారులు అర్చనాకుమారి, మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సదనం బాలల పర్యవేక్షకురాలు వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

ఖమ్మంఖానాపురంహవేలీ,ఏప్రిల్15: కేంద్రప్రభుత్వం కార్పొరేట్ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లేందుకు రిజర్వేషన్ల రద్దుకు కుట్ర పన్నుతోందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సెమినార్‌లో మాట్లాడారు. అఖిల భారత విద్యాహక్కుల వేదిక రూపొందించిన పీపుల్స్ మానిఫెస్టోను విడుదల చేశారు. విద్యను వ్యాపారీకరణ, కార్పొరేటీకరణతో వేగవంతం చేస్తుందన్నారు. ఈ సెమినార్‌లో నాయకులు బాబురావు, మనోహర్‌రాజు, ఆళ్ల రామారావు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీ. నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఖమ్మంలో మార్వాడి యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ప్రారంభం

ఖానాపురంహవేలి, ఏప్రిల్15: ఖమ్మంలో సోమవారం మార్వాడి యూనివర్శిటి అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీర్ రాజేష్ మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్‌లో 50శాతం మార్కులు పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అన్ని కోర్సులలో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర నాయుడు, వెంకి నాయుడు, వెంకట్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ టిప్పర్ దగ్ధం

ముదిగొండ, ఏప్రిల్15: ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి టిప్పర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం అర్థరాత్రి ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం వద్ద చోటుచేసుకుంది. లారీ ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో లారీ మొత్తం వ్యాపించాయి. ఈ ఘటనలో టిప్పర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ తప్పించుకొనగా లారీ పూర్తిగా దగ్ధమైంది. ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు.

నేడు న్యాయవాద సహకార సొసైటీ ఎన్నికలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్15: న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. నాలుగు డైరెక్టర్ల పదవులకు ఆరుగురు పోటీ పడుతున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సంవత్సరం ఖాళీ అయిన నాలుగు స్థానాలకు త్రీవపోటీ నెలకొంది. డైరెక్టర్ల ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న వారు తమకు అనుకూల డైరెక్టర్ల గెలుపునకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహన్నాం 2:30 వరకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని, ఫలితాలు వెంటనే ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది : డీఎం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్15: సత్తుపల్లి, కల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల నిర్వహణకు సహకరిస్తున్న దాతల సహకారం మరువలేనిదని సత్తుపల్లి డీఎం యూ.రాజ్యలక్ష్మీ అన్నారు. సోమవారం సత్తుపల్లి బస్టాండ్‌లో వేసవి దృష్ట్యా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మొదటి రోజు ఆర్కే ఫౌండేషన్ నిర్వహకులు ఇనపనూరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సుమారు400మంది ప్రయాణీకులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబోజు శ్రీనివాసరావు, ఎస్‌కే.గుమ్మావలీ, నందిపాటి రవి, కే.సాంబ, పీ.సుధాకర్, ఆర్టీసీ ఉద్యోగులు సుబ్బారావు, ఎస్‌కే.పాషా, కిన్నెర ఆనందరావు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

సర్వీసు పొడిగించాలని డీఎంకు వినతి

వేంసూరు మండలం మర్లపాడు, భీమవరం, సత్తుపల్లి మండలం సదాశివునిపేట, సిద్దారం, గౌరిగూడెం గ్రామాల మీదుగా హైదరాబాద్ వెళ్లె సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ (8858) ఎంజీబీఎస్ వరకు మాత్రమే నడుపుతున్నారు. అయితే ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సత్తుపల్లి పరిసర ప్రాంతాల వారు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, చింతల్, ప్రగతినగర్, నిజాంపేట్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రాంతాలలో నివాసం ఉంటున్నారు. దీంతో ఈ సర్వీస్‌ను ఆయా ప్రాంతాలకు పొడిగించాలని విన్నవించారు. తిరుగు ప్రయాణంలో సత్తుపల్లి, వేంసూరు మండలాలల్లో పేర్కొన్న గ్రామాలకు నడపవలసిందిగా ప్రయాణీకులు డీఎం రాజ్యలక్ష్మీని వినతిపత్రం ద్వారా కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని డీఎం తెలిపారు.



ప్రయాణీకులకు మజ్జిగ అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మీ

బెల్ట్ దుకాణాలను సమూలంగా మూసివేయాలి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15: గ్రామాల్లో అనాధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను సమూలంగా మూసి వేయించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డిని పీవైఎల్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సమయంలోను విచ్చల విడిగా బెల్ట్ దుకాణాల వ్యాపారం జోరుగా సాగుతుందన్నారు. మంచినీళ్ల లేని దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ మద్యం లేని గ్రామాలు, వీధులు మాత్రం కనిపించటం లేదని ఆరోపించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, ఉపాధ్యక్షురాలు టీ రూన్సీ, నాయకులు శోభ, జక్కుల వనితబేగం పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి

కల్లూరు/పెనుబల్లి ఏప్రిల్15: పెనుబల్లి మండలంలోని గణేశునిపాడు, చౌడారం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అదనపు కలెక్టర్ డి మధుసూదన్‌నాయక్ తనిఖీ చేశారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు ధాన్యం కేంద్రాలకు తెచ్చేలా రైతులకు అవగహన కల్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస మౌళిక సదుపాయాల కల్పన చేయాలని, నీడకొరకు షామీయాన అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక చెక్‌పోస్ట్ అధికారులను సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటుగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ తదితర అధికారులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో మోసం చేస్తున్న విద్యా సంస్థలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్15: ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో పలు ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అనధికారికంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల చేర్చుకుంటున్నారని ఆరోపించారు.

వక్ఫ్ భూములను కాపాడాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15: ఖమ్మం నగరంలో వక్ఫ్ భూములను ప్రభుత్వం కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ సలామ్ డిమాండ్ చేశారు. గోల్లగూడెం ప్రాంతంలో రోజు రోజుకు భూముల ధరలు పెరగటంతో కొంతమంది నాయకులు వక్ఫ్ భూములను కబ్జాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

తల్లి పిల్లల సంరక్షణే లక్ష్యం

సీడీపీఓ కమలాప్రియ

ఖమ్మంరూరల్, ఏప్రిల్15: తల్లి పిల్లల సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని సీడీపీఓ కమలాప్రియ అన్నారు. మండల పరిధిలోని నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్‌డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీస్కూల్ బోధనాపరికరాల ప్రదర్శనను సీడీపీవో, పిల్లల తల్లిదండ్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, సరిత, సరోజిని, ఉపేంద్రమ్మ పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కామేపల్లి,ఏప్రిల్15: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలని , అవార్డును పరిశీలించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి క్రిష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రైతుల భూములను ప్రభుత్వం తీసుకొని ఇంత వరకు నష్ట పరిహరం అందించలేదని, అంతేకాకుండా ఆ భూమికి పరిహరం చెల్లించకుండా కాలువ భూమి కింద కన్వర్ట్ చేయడంతో 2019 నుంచి రైతులకు రైతు బంధు రావడంలేదని అన్నారు. రైతులకు పరిహరం చెల్లించి వెంటనే కాలువ పనులు చేపట్టాలని నూతన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అంతోటీ అచ్చయ్య, సీపీఐ జిల్లా నాయకురాలు ఏపూరి లతాదేవి, బాదావత్ శ్రీను, కోళ్ల అప్పారావు, ఎస్పీ రాకేష్ భూనిర్వాసితులు ఆంగోత్ బాలాజీ, భద్రయ్య, రామక్రిష్ణ, సుగుణమ్మ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో గెలుపే బీజేపీ లక్ష్యం

తల్లాడ, ఏప్రిల్15: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. సోమవారం అన్నారుగూడెంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి తల్లాడ మండలంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు చావా కిరణ్, గాదె కృష్ణారావు, వెల్లంకి సుధాకర్, వినీత్‌రావు పాల్గొన్నారు.

షర్ఫుద్దీన్‌కు బండారు శుభాకాంక్షలు



నేలకొండపల్లి,ఏప్రిల్15:నేలకొండపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు షేక్.షర్ఫుద్దీన్‌కు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ లేఖను పంపారు. రంజాన్ పర్వదినం అనంతరం ఆలస్యంగా షర్ఫుద్దీన్‌కు ఈ లేఖ చేరింది. బండారు నుంచి శుభాకాంక్షల లేఖ అందుకున్న షర్ఫుద్దీన్ కొంత భావోద్వేగానికి గురయ్యాడు.

పేకాటలో ఐదుగురి అరెస్ట్

సత్తుపల్లి,ఏప్రిల్15: మండలంలోని యాతాలకుంట-చంద్రాయపాలెం మధ్యలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో సత్తుపల్లి, ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐల ఆధ్వర్యంలో దాడిచేశారని, ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారివద్ద నుంచి రూ.39,640నగదు, పేక ముక్కలు, 8సెల్‌ఫోన్లు, 5ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. విలేకరుల సమావేశంలో సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్, టాస్క్‌ఫోర్స్ సీఐ జే.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలి

రఘునాథపాలెం, ఏప్రిల్15: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని ఏడాదిలో 200రోజులు పని కల్పించాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాంక్యాతండా గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. కనీస సౌకర్యాలు కల్పించటం లేదని ఆరోపించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు, కేలోత్ పాపారావు, జాటోత్ ప్రేమ్‌సింగ్, ధరావత్ లక్ష్మణ్, జాటోత్ హాలియా, గుగులోత్ మూర్తి, వైఎస్ ఎంపీపీ మాలోత్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీపీఆర్ఎస్ బలోపేతానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

రాష్ట్ర ఇన్‌చార్జ్ కిరణ్ మూగభాస్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్15: రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆర్టీపీఆర్ఎస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ కిరణ్ మూగభాస్, ఖమ్మం జోనల్ కన్వీనర్ ఎండీ జావీద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఆర్టీపీఆర్ఎస్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అనేది అట్టడుగు స్థాయి ప్రజలకు రాజకీయ అవకాశాలను విస్తరించటంతో పాటుగా పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కార్పొరేటర్ కమర్తపు మురళీ, గజ్జెల లక్ష్మీ, రాఫీదాబేగం, రాపూరికరుణ, వడ్డే నారాయణ పాల్గొన్నారు.

'కమల్‌రాజ్ అంటేనే కమీషన్ల రాజ్'

మధిరటౌన్,ఏప్రిల్15: కమల్‌రాజ్ అంటేనే కమీషన్ల రాజ్ అని సొంత పార్టీ వారే చెప్పుకుంటున్నారని అటువంటి వ్యక్తికి భట్టిని విమర్శించే అర్హత లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు నాలుగు సార్లు చీకొట్టినా కమల్‌రాజుకు బుద్ధి రాలేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దారా బాలరాజు, కర్నాటి రామారావు, నిడమానూరు వంశీ, అద్దంకి రవి, చక్రి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ

ఖమ్మం క్రైం, ఏప్రిల్15: నగర శివారులో రామన్నపేటకు చెందిన 15ఏళ్ల బాలిక సోమవారం రాత్రి కనిపించకుండా పోయింది. రూరల్ మండలం కొత్తగూడేనికి చెందిన ఓ యువకుడు అపహరించాడని బాలిక తండ్రి సోమవారం రాత్రి అర్బన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

ఐదు సాధారణ బోగిలు ఏర్పాటు చేయాలి

కారేపల్లి ఏప్రిల్15: ప్రతీ ఎక్స్‌ప్రెస్ రైలులో ఐదు సాధారణ బోగీలను పెంచాలని జాతీయ బోగీల సాధన సమితి కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సోమవారం కమలాపురంలో పీఎంకి ఉత్తరాలు రాశారు.